క్లుప్తంగా

రాజకీయ పార్టీ నేతలతో సమావేశం



మాట్లాడుతున్న ఆర్డీవో హనుమానాయక్

మంథని: పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి రాజకీయ పార్టీ నేతలతో మంగళవారం ఆర్డీవో హనుమానాయక్ సమావేశమయ్యారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం జరుగుతుందని, ఇందులో భాగంగా ఈ నెల 20 నుంచి అక్టోబర్ 18 వరకు నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు, పోలింగ్ స్టేషన్ల పరిధిలో ఇంటింటా సర్వే నిర్వహిస్తామని పేర్కొన్నారు. సర్వేలో పోలింగ్ స్టేషన్ పరిధిలో బీఎల్‌వో తమకు కేటాయించిన ఓటరు జాబితా క్రమంగా సందర్శించాలన్నారు. నియోజకవర్గంలోని తహసీల్దార్లు, సూపర్‌వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

'ఎల్లంపల్లి' ప్రభావిత గ్రామాల పరిశీలన



ఉధృతంగా ప్రవహిస్తున్న ఎరుకల చెరువు

పాలకుర్తి: మూడురోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండల పరిధిలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్ట్ ప్రభావిత గ్రామాలను బసంత్‌నగర్ ఎస్సై ఆర్.స్వామి సందర్శించారు. కుక్కలగూడుర్, వేంనూర్ గ్రామాల శివారులో ఎల్లంపల్లి బ్యాక్‌వాటర్‌ను పరిశీలించి స్థానికులకు సూచనలు చేశారు. పెద్దపల్లి మండలం రాగినేడు గ్రామ చెరువు అలుగు పారడంతో మండలంలోని కొత్తపల్లి గ్రామ శివారులోని ఎరుకల చెరువు ఉధృతంగా ప్రవహిస్తోంది. గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిపై గల బ్రిడ్జిని తాకుతూ వరదనీరు ప్రవహిస్తుండటంతో సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్సై గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

నష్టపోయిన ప్రజలను ఆదుకోవాలి

గోదావరిఖని: భారీ వర్షాల కారణంగా నష్టపోయిన ప్రజలను వెంటనే ఆదుకోవాలని సీపీఐఎంఎల్ జిల్లా కార్యదర్శి జూపాక శ్రీనివాస్ డిమాండ్ చేశారు. యూనియన్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలతో వరదల మూలంగా రైతాంగం, ప్రజలు, చిరు వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. విషజ్వరాలతో ప్రజలందరూ అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రత్యేక మెడికల్ క్యాంపులు నిర్వహించాలని కోరారు. ప్రజలను ముప్పు ప్రాంతాలకు తరలించాలని, అధికారులే దగ్గరుండి ప్రజలకు అన్నిరకాల ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో నాయకులు గుజ్జుల సత్యనారాయణరెడ్డి, తోకల రమేశ్, గుమ్మడి వెంకన్న, ఆడెపు శంకర్, మార్త రామన్న, పెండ్యాల రమేశ్, కోడిపుంజుల లక్ష్మి, గొల్లపల్లి చంద్రన్న, కట్ల తేజేశ్వర్ పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

యైటింక్లయిన్‌కాలనీ: గోదావరి నదీ పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రామగిరి ఎంపీడీవో శైలజరాణి సూచించారు. రామగిరి మండలం సుందిళ్ల గ్రామ సమీపంలోని గోదావరి నది పుష్కర్ ఘాట్ వద్ద వరద ప్రవాహాన్ని మంగళవారం ఎంపీవో ఉమేశ్, కార్యదర్శి రమేశ్‌తో కలిసి ఆమె పరిశీలించారు.

ఆలయాల్లో హోమం

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని శివాలయం, వేణుగోపాలస్వామి ఆలయంలో ఉన్న సాంబశివాలయంలో భక్తులు హోమం నిర్వహించారు. మంగళవారం ప్రత్యేక పూజలు చేసిన అనంతరం గీత పారాయణం, భజన చేశారు. స్వామివారికి రుద్రాభిషేకం చేశారు. కార్యక్రమం అనంతరం పూజారులు మహేశ్, రమేశ్ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

అక్రమ లేఅవుట్లపై హెచ్చరిక బోర్డులు ఏర్పాటు

రామగిరి: మండలంలోని రత్నాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన అక్రమ లేఅవుట్లపై అధికారులు చర్యలు చేపట్టారు. గ్రామంలో ఏర్పాటు చేసిన అక్రమ లేఅవుట్లపై గ్రామస్తుడు కండె పోచం కలెక్టర్ ఫిర్యాదు చేశాడు. కాగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం కార్యదర్శి, సిబ్బందితో కలిసి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఇక్కడ స్థలాలు అమ్మినా, కొన్నా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని, అక్రమంగా లేఅవుట్లు వేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

నేత్రదానంపై అవగాహన

రామగిరి: మండలంలోని కల్వచర్ల ప్రగతి పాఠశాలలో మంగళవారం సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాతీయ నేత్రదాన పక్షోత్సవ అవగాహన ర్యాలీ నిర్వహించారు.

శిథిలావస్థ ఇళ్లలో ఉండొద్దు

- మున్సిపల్ అధికారులు

పెద్దపల్లిరూరల్: మున్సిపల్ పరిధిలో శిథిలావస్థలో ఉన్న ఇళ్లను స్వచ్ఛందంగా తొలగించాలని మున్సిపల్ అధికారులు సూచించారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో కమిషనర్ వెంకటేశ్, మేనేజర్ శివప్రసాద్, టీపీవో శ్రీహరి మంగళవారం పలు ఇళ్లను గుర్తించి శిథిలావస్థ ఇళ్లలో నివాసం ఉంటే నష్టం కలిగే ప్రమాదముందన్నారు. స్వచ్ఛందంగా కూల్చుకోకుంటే మున్సిపల్ సిబ్బంది యంత్రాలతో కూల్చివేస్తారని పేర్కొన్నారు. ఇతర అవసరాల కోసం హెల్ప్‌లైన్ నంబర్ 6301 27484కు సమాచారం అందించాలని సూచించారు.



సూచనలు చేస్తున్న మున్సిపల్ అధికారులు

సీఎంపీఎఫ్ కుంభకోణంపై సీబీఐ విచారణ జరపాలి

గోదావరిఖని: కోల్‌మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ (సీఎంపీఎఫ్)లో జరిగిన రూ.వెయ్యికోట్ల కుంభకోణంపై సీబీఐతో విచారణ జరిపించాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. ఆర్జీ–2 ఏరియాలోని వకీల్‌పల్లిగనిపై మంగళవారం ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కుంభకోణానికి బాధ్యులైన వారి నుంచి రికవరీ చేయాలని కోరారు. సింగరేణిలో కూడా చెకప్ సిస్టం ప్రవేశపెట్టాన్నారు. క్యాడర్స్ స్కీం మెరుగుపరిచి ఓవర్ మెన్, మైనింగ్ సర్దార్, డేటా ఎంట్రీ ఆపరేటర్, జనరల్ మజ్దూర్, బదిలీ వర్కర్, కార్మికుల డెసిగ్నేషన్ వెంటనే మార్చేందుకు ఆదేశాలు జారీ చేయాలన్నారు. గతేడాది సంస్థ సాధించిన వాస్తవ లాభాలను ప్రకటించి అందులో 35శాతం వాటా చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. నాయకులు సారంగపాణి, వడ్డేపల్లి కుమారస్వామి, మాదాసి రవీందర్, యాదగిరి నరేశ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సత్తయ్య

కళాకారుల సమస్యలు పరిష్కరించాలి



సీఅండ్ఎండీని సన్మానిస్తున్న కళాకారులు

గోదావరిఖనిటౌన్: సింగరేణి ఐక్యవేదిక కళాకారులు మంగళవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో సింగరేణి సీఅండ్ఎండీ బలరాం నాయక్‌ను కలిసి కళాకారుల సమస్యలు, సౌకర్యాల కల్పనకై వినతిపత్రం అందజేశారు. సీఅండ్ఎండీ కళాకారుల సమస్యలపై సానుకూలంగా స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్టు కళాకారుల ఐక్యవేదిక సభ్యులు తెలిపారు. అనంతరం సీఅండ్ఎండీని సన్మానించారు. కళాకారుల ఐక్యవేదిక రామగుండం రీజియన్ గౌరవ సలహాదారులు కవ్వంపల్లి స్వామి, అధ్యక్షుడు సాధనవేణి ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి పులియాల సతీశ్‌కుమార్, ఉపాధ్యక్షుడు ఎస్‌డీ హమీద్, సాన జలపతి, శివకుమార్ పాల్గొన్నారు.

షరతులు లేకుండా రుణమాఫీ అమలు చేయాలి

రామగుండం: కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అసంపూర్తి రుణమాఫీతో రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి అన్నారు. రామగుండం తహసీల్దార్ కార్యాలయం ఎదుట అసంపూర్తి రుణమాఫీకి వ్యతిరేకంగా మంగళవారం బీజేపీ శ్రేణులు బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని నాయబ్ తహసీల్దార్ మల్యాల తిరుపతికి సమర్పించారు. ఎలాంటి షరతులు లేకుండా రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని పేర్కొన్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుతం 13 రకాల కొర్రీలు పెట్టి రుణమాఫీని తప్పించుకునే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ఇప్పటికీ రైతు బీమా పథకం ఊసే లేదని, వరి క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లింపు మరిచిందని విమర్శించారు. ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రతినిధులు పిడుగు కృష్ణ, బోడకుంట సుభాష్, కోమళ్ల మహేశ్, కొండపర్తి సంజీవ్, మిట్టపల్లి సతీశ్, బాణాల స్వామి, కోడూరి రమేశ్, నవీన్‌గౌడ్, రాజ్‌కుమార్, మహేశ్, మాడ ప్రభాకర్ రెడ్డి, లగిశెట్టి తిరుపతి, రాజమల్లు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న బీజేపీ నాయకులు

ఎల్‌వోసీ అందజేత



ఎల్‌వోసీ పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే

ఓదెల: మండలంలోని గుంపుల గ్రామానికి చెందిన మొగిలి అనారోగ్యంతో హైదరాబాద్ నిమ్స్ హాస్పిటల్‌లో చేరాడు. ఆపరేషన్ నిమిత్తం పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు రూ.1,25,000 ఎల్‌వోసీ పత్రాన్ని మంగళవారం బాధితుడి కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఆర్‌వీఆర్ కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు చెల్లించాలి

గోదావరిఖని: జీడీకే–5 ఓసీపీలో పనిచేస్తున్న ఆర్‌వీఆర్ కాంట్రాక్టు కార్మికులకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ నాయకులు శనిగల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. వేతనాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్న ఆర్‌వీఆర్ సంస్థను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలన్నారు. ఓబీలో పనిచేస్తున్న వోల్వో డ్రైవర్లు, బ్లాస్టింగ్ కార్మికులకు రెండు నెలల వేతనాలు చెల్లించాలన్నారు. ప్రతీనెల 7న వేతనాలు ఇవ్వాలని సింగరేణి యాజమాన్యమే సర్క్యులర్ ఇచ్చినా.. దాని అమలులో అధి కారులు పూర్తిగా విఫలం అవుతున్నారని విమర్శించారు.



ఆందోళన నిర్వహిస్తున్న నాయకులు

అధికారులకు సన్మానం



సన్మానిస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

రామగిరి: ఆర్జీ–3 ఏరియాకు ఇటీవల బదిలీపై వచ్చిన సింగరేణి అధికారులను మంగళవారం ఐఎన్‌టీయూసీ నాయకులు సన్మానం చేశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఏఎస్‌వో జె.రాజశేఖర్, పర్సనల్ మేనేజర్ బి.సుదర్శనం, ఓసీపీ–2 పీవో వెంకటరమణను సన్మానించారు. ఐఎన్‌టీయూసీ నాయకులు రామిండ్ల మనోహర్, మత్రి ఓదెలు, వివిధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడిగా భాస్కర్

సుల్తానాబాద్: ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడిగా కొమురవెల్లి భాస్కర్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి అల్లంకి లింగమూర్తి ప్రకటించారు. సుల్తానాబాద్ ఆర్యవైశ్య భవన్‌లో మంగళవారం ఎన్నికలు నిర్వహించారు. రెండోసారి అధ్యక్షుడిగా భాస్కర్, గౌరవాధ్యక్షుడిగా కొమురవెల్లి రామ్మూర్తి వ్యవహరించనున్నారు. సెక్రటరీగా తొడుపునూరి రాజేంద్రప్రసాద్, కోశాధికారిగా కొమురవెల్లి (కేబి) శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆర్యవైశ్య పట్టణ మహిళా సంఘం అధ్యక్షురాలిగా బాదం వాణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన వారిని సన్మానించారు. వాసవీమాత ఆలయ చైర్మన్ చకిలం మారుతి, పల్లా శ్రీనివాస్, ఎల్లంకి రాజన్న, శివనత్రి ప్రసాద్, అల్లంకి హరీశ్, హాసిని పాల్గొన్నారు.



నూతనంగా ఎన్నికైన వారికి సన్మానం

- **ప్రభుత్వ విప్ పరామర్శ**

ధర్మారం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ధర్మారం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కాడే సూర్యనారాయణను మంగళవారం సాయంత్రం ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్ పరామర్శించారు. ఇటీవల సిద్దిపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌లో చికిత్స అనంతరం ఇంటికి వచ్చిన సూర్యనారాయణను విప్ కలిసి పరామర్శించారు. యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సోగాల తిరుపతి, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అరిగె లింగయ్య, మాజీ ఎంపీపీ కొడారి హన్మయ్య, నాయకులు ఓరం చిరంజీవి, దేవి అఖిల్, పాలకుర్తి సాయి, మందపెల్లి మల్లేశం ఉన్నారు.

- **దరఖాస్తుల ఆహ్వానం**

రామగిరి: ఆర్జీ–3, ఏపీఏ ఏరియాల సింగరేణి సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్న టైలరింగ్, మగ్గం వర్క్, బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్, జూట్ బ్యాగ్స్ తయారీ మొదలగు నైపుణ్యాభివృద్ధి కోర్సుల శిక్షకురాలిగా పనిచేయడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆర్జీ–3 పర్సనల్ మేనేజర్ బి.సుదర్శనం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల సింగరేణి ఉద్యోగుల కుటుంబ మహిళలు, పరిసర గ్రామాల మహిళలు దరఖాస్తుకోవాలని సూచించారు. దరఖాస్తుతో పాటు సంబంధిత విభాగంలో అనుభవ ధృవీకరణ పత్రాలు, ఆధార్‌కార్డు, విద్యార్హత ధృవీకరణ పత్రాలను జత చేసి ఆర్జీ–3 జీఎం కార్యాలయంలోని పర్సనల్ విభాగంలో 10వ తేదీలోపు సమర్పించాలన్నారు. ఇతర వివరాలకు పర్సనల్ విభాగంలో సంప్రదించాలన్నారు.

- **నూతన ప్లాంట్ల కోసం పీపీఏ ఇప్పించాలి**

గోదావరిఖని: రామగుండం ఎన్టీపీసీలో నూతన విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు కోసం పవర్ పర్చేజ్ అగ్రిమెంట్(పీపీఏ) ఇప్పించాలని బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్ కోరారు. మంగళవారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. నూతన విద్యుత్ ప్లాంట్లు నెలకొల్పేందుకు కృషి చేస్తున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్‌కు అభినందనలు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

- **అధికారులకు సన్మానం**

రామగిరి: ఆర్జీ–3 ఏరియాకు ఇటీవల బదిలీపై వచ్చిన అధికారులను మంగళవారం ఏఐటీయూసీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. బదిలీపై వచ్చిన ఆర్జీ–3 పర్సనల్ మేనేజర్ బి.సుదర్శనం, ఏరియా సేఫ్టీ అధికారి జే.రాజశేఖర్, ఏరియా సెక్యూరిటీ అధికారి అబ్దుల్ షబ్బీరుద్దీన్‌ను సన్మానించారు. ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ వై.వి.రావు, ఆర్జీ–3 బ్రాంచ్ సెక్రటరీ ఎం.ఆర్‌సీ రెడ్డి, నాయకులు మల్లేశ్, గంగాధర్, వెంకటస్వామి, కొమురయ్య, రాజేందర్ పాల్గొన్నారు.

నేడు ఇంటర్ డిపార్ట్‌మెంటల్ క్రీడాపోటీలు

ఆర్జీ–3, ఏపీఏ ఏరియాల వర్క్‌పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 2024–25 సంవత్సరానికి గాను నిర్వహించనున్న ఇంటర్ డిపార్ట్‌మెంటల్ క్రీడాపోటీలు ఈ నెల 4వ తేదీన ప్రారంభించనున్నట్లు ఆర్జీ–3 పర్సనల్ మేనేజర్ బి.సుదర్శనం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

- **మృతుల కుటుంబాలకు పరామర్శ**

జూలపల్లి: మండల కేంద్రంలో ఇటీవల ఇద్దరు అనారోగ్యంతో మృతి చెందారు. వారి కుటుంబాలను జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్, నేనున్నా స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రఘువీర్‌సింగ్ పరామర్శించారు. జూలపల్లికి చెందిన జక్కని రమేశ్ తల్లి, మోదుంపెల్లి నర్సయ్య తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. కాగా మంగళవారం ఇరు కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా రెండు కుటుంబాలకు 50కిలోల చొప్పున బియ్యం అందజేశారు.

- **ఆర్థికసాయం**

రామగుండం: పట్టణంలోని తబితా ఆశ్రమంలో స్వర్గీయ సెల్లింగ్‌బాబు జయంతి పురస్కరించుకొని మంగళవారం మృతుడి బంధువులు చిన్నారులకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. చిన్నారుల పోషణ నిమిత్తం ఆశ్రమ నిర్వాహకుడు వీరేందర్‌నాయక్‌కు రూ.5వేల నగదు అందజేశారు. మృతుడి సోదరి అన్నమ్మ, మొగురం గట్టయ్య, యశ్వంత్ ఉన్నారు.

- **'ఉన్నతి'పై అవగాహన**

పాలకుర్తి: మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉన్నతి కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీఆర్‌డీఏ అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ (ఏపీడీ) సత్యనారాయణ పాల్గొని ఉన్నతి కార్యక్రమం గురించి వివరించారు.

- **క్షీరాభిషేకం**

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ గౌతమినగర్ చౌరస్తాలో కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి బెంద్రం రాజిరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లుబట్టి విక్రమార్క, మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం నిర్వహించారు.

- **రోడ్డుకు తాత్కాలిక మరమ్మతు**

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం బ్రాహ్మణపల్లి, రాగినేడు గ్రామాలకు వెళ్లే దారిలో ఉన్న కల్వర్టు వద్ద బసంత్‌నగర్ పోలీసులు మంగళవారం తాత్కాలిక మరమ్మతు పనులు చేపట్టారు. ఇటీవల కురిసిన వానలకు అధ్వానంగా మారి రాకపోకలకు ఇబ్బందిగా ఉందని తెలుసుకున్న ఎస్సై స్వామి క్రషర్ల నుంచి డస్ట్ తెప్పించి పోయించారు.

- **యుద్ధశూరుడు పుస్తకావిష్కరణ**

పెద్దపల్లిరూరల్: యుద్ధశూరుడు అనే పుస్తకాన్ని మంగళవారం పెద్దపల్లిలో ఆవిష్కరించారు. ఈ పుస్తకంలో 'నేను చావను నేను జీవిస్తా' అనే కవిత రాసినట్లు యజ్ఞ ఎన్‌లైట్ సొసైటీ వ్యవస్థాపకుడు పల్లె శాంతిరాజ్ తెలిపారు.

- **అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోండి**

మంథని: మున్సిపల్ పరిధిలోని పలు అక్రమ నిర్మాణాలపై హైకోర్టులో పిల్ విచారణ కొనసాగుతూ కేసు పెండింగ్‌లో ఉంది. కాగా మరో వైపు అక్రమ నిర్మాణాలు చేస్తూ సీజ్ చేసిన భవనాలు తిరిగి వినియోగంలోకి తెచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని న్యాయవాది, మంథని మాజీ ఉప సర్పంచ్ ఇనుముల సతీశ్ మంగళవారం మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున్‌కు వినతిపత్రం అందజేశారు.



పెద్దపల్లిరూరల్: మండలంలోని రాగినేడు శివారులోని లోలెవల్ కాజ్‌వే కల్వర్టు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. ఈ మార్గంలో ఓవర్‌లోడ్ వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. చాలాకాలం కిందట నిర్మించిన కల్వర్టు కావడంతో శిథిలావస్థకు చేరిందని స్థానికులు పేర్కొంటున్నారు. ఎలాంటి ప్రమాదం జరగక ముందే కల్వర్టు నిర్మించాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
నవీన్, ఆర్అండ్‌బీ ఏఈ, సెల్ నంబర్ : 90149 51989

వాట్సప్ చేయండి..
మా ఫోన్ నంబర్ : 98499 71500
మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

ఎఫ్‌డీ డిపాజిట్ల సేకరణే లక్ష్యం

సుల్తానాబాద్: కష్టమర్ల నుంచి ఎఫ్‌డీ డిపాజిట్ల సేకరణ లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎస్‌బీఐ జనరల్ మేనేజర్ రఘునాథ్ అన్నారు. పట్టణంలోని ఎస్‌బీఐ పూసాల బ్రాంచ్‌లో మంగళవారం ఆయన మాట్లాడారు. ఎఫ్‌డీలు మార్చి 31 వరకు కొనసాగుతాయని, ఈ అవకాశాన్ని ఎస్‌బీఐ ఖాతాదారులు వినియోగించుకోవాలని కోరారు. 444 రోజులకు గాను 7.25శాతం వడ్డీని అందిస్తుందని, సీనియర్ సిటిజన్లకు 7.75శాతం వడ్డీని అందజేస్తున్నామని వివరించారు. ప్రతీ ఒక్క బ్యాంకు ఖాతాదారుడితో పాటు ఇతర బ్యాంకు ఖాతాదారులు సైతం ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ రాజేశ్‌కుమార్ క్యాషియర్ మౌనిక, అధికారులు సృజన, సమీర్, శ్రీనివాస్, హరీశ్ పాల్గొన్నారు.



కేక్ తినిపిస్తున్న ఎస్‌బీఐ మేనేజర్ రఘునాథ్

సింగరేణిలో ఉద్యోగం రావడం ఒక వరం

రామగిరి: సింగరేణి సంస్థలో ఉద్యోగం రావడం ఒక వరమని ఏపీఏ జీఎం కొప్పుల వెంకటేశ్వర్లు అన్నారు. సెంటనరీకాలనీ ఎంవీటీసీలో శిక్షణ పొందిన 30మందికి మంగళవారం కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేశారు. అనంతరం జీఎం మాట్లాడుతూ స్థాయికి తగ్గట్టుగా పనిచేస్తూ సూపర్‌వైజర్ల ఆదేశాలు పాటిస్తూ అనుక్షణం అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. సంస్థ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి కొలిపాక నాగేశ్వరరావు, పర్సనల్ మేనేజర్ బి.సుదర్శనం, డీవైపీఎం సునీల్ ప్రసాద్, ఎంవీటీసీ మేనేజర్ మల్లన్న, ఏపీఏ అడిషనల్ మేనేజర్ సునీల్ కుమార్, జూనియర్ అసిస్టెంట్ క్రాంతికిరణ్ పాల్గొన్నారు.



కార్మికులతో జీఎం వెంకటేశ్వర్లు

పెండింగ్ సమస్యలు త్వరగా పరిష్కరించాలి

పాలకుర్తి: బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కర్మాగారంలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల పెండింగ్ సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని కార్మికసంఘం అధ్యక్షుడు కౌశికహరి కంపెనీ అధికారులను కోరారు. మంగళవారం కర్మాగారంలోని కార్మికులను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కంపెనీ హెచ్‌ఆర్ మేనేజర్ పార్థసారధిని ఆయన చాంబర్‌లో కలిసి కార్మికుల సమస్యలపై చర్చించారు. గతంలో పనిచేసిన యూనియన్ల మూలంగా అర్హులైన కార్మికులకు కాంట్రాక్ట్ బేసిక్ పదోన్నతిలో అన్యాయం జరిగిందని, వాటిని సరిచేయాలని కోరారు. స్పందించిన మేనేజర్ కంపెనీ ఉన్నతాధికారులతో చర్చించి కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. కాంట్రాక్ట్ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి మాదాసు శ్రీనివాస్, బత్తిని సతీశ్, రమేశ్, సంపత్, రామకృష్ణ, రాజయ్య, తిరుపతి, సాదిక్, పూసల ప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కౌశిక హరి

రక్షణ పేరుతో కార్మికులను వేధిస్తే ఊరుకోం

గోదావరిఖని: రక్షణ పేరుతో కార్మికులను వేధింపులకు గురిచేస్తే ఊరుకోబోమని ఏఐటీయూసీ ఆర్జీ–2 డివిజన్ సెక్రటరీ జీగురు రవీందర్ అన్నారు. ఆయన మంగళవారం కార్మికులను కలిసి సమస్యలు తెలుసుకున్నారు. సేఫ్టీ అధికారులు అత్యుత్సాహం చూపుతూ కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తూ మనోధైర్యం దెబ్బతీస్తున్నారన్నారు. సీహెచ్‌పీలో పనిచేస్తున్న కార్మికులకు నాణ్యమైన బూట్లు ఇవ్వాలని, జీఎల్ బంకర్ వద్ద పనిచేస్తున్న కార్మికులకు గమ్ షూస్ ఇవ్వాలన్నారు. బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ అన్నారావు, బ్రాంచ్ సహాయ కార్యదర్శి గంధం సాంబశివరావు, నాయకులు శంకర్, రమేశ్, శంకర్, రాజశేఖర్, కిషోర్‌బాబు, రాజేంద్రప్రసాద్, తిరుపతి, రమేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



కార్మికులతో మాట్లాడుతున్న నాయకులు

బీజేపీని మరింత బలోపేతం చేద్దాం

పెద్దపల్లిరూరల్: బీజేపీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు అందరూ పనిచేయాలని, పార్టీ చేపట్టిన సభ్యత్వ నమోదుపై శ్రద్ధ చూపాలని సంయుక్త మోర్చాల జిల్లా కన్వీనర్‌లు తాత రవి, క్యాతం వెంకటరమణ అన్నారు. జిల్లా పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. పార్టీ నిర్దేశించిన సభ్యత్వ లక్ష్యాలను అధిగమించాలని, ఇందుకు జిల్లా కోఆర్డినేటర్లను నియమిస్తున్నట్లు పేర్కొన్నారు. కిసాన్‌మోర్చా జిల్లా కోఆర్డినేటర్‌గా తంగెడ రాజేశ్వర్‌రావు, ఓబీసీ మోర్చా నుంచి సంపత్, యువమోర్చా నుంచి రాజం మహంత, మహిళా మోర్చా నుంచి సోమారపు లావణ్య, ఎస్టీ మోర్చా నుంచి రాజేశ్‌నాయక్, ఎస్సీ మోర్చా నుంచి నరహరి సభ్యత్వ నమోదు కోఆర్డినేటర్లుగా వ్యవహరిస్తారని వివరించారు.

బియ్యం అందజేత

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని పందిల్లకు గ్రామానికి చెందిన చిలుముల అంకూస్ ఇటీవల మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులకు మంగళవారం మాజీ జెడ్పీటీసీ వంగళ తిరుపతిరెడ్డి బీఆర్‌ఎస్ నాయకుల ద్వారా క్వింటాల్ బియ్యం అందించారు. నాయకులు పాల్గొన్నారు.